సాక్షి రంగారెడ్డి

బుధవారం, 10, ఏప్రిల్, 2024




ఆశలు ఆవిరి

మండే ఎండలతో చెరువులు, కుంటలు, జలాశయాల్లో నీరు అడుగంటింది. భూగర్భ జలాలు పాతాళానికి చేరాయి. 8లో▸



మానవత్వం గొప్పది

మతం కంటే మానవత్వం గొప్పదని, అన్ని మతాల సారాంశం అదేనని కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి అన్నారు. 8లో▸



న్యూస్‌రీల్

ఆదిబట్ల అభివృద్ధికి సహకరించండి

మంత్రిని కోరిన మున్సిపల్ చైర్మన్ నిరంజన్‌రెడ్డి



మంత్రి కోమటిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నిరంజన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కోరారు. మంగళవారం తెలుగు నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని ఆయన మంత్రిని శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన నిరంజన్‌రెడ్డికి మంత్రి కోమటిరెడ్డి శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. మున్సిపల్ అభివృద్ధికి తనవంతు సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు పల్లె గోపాల్‌గౌడ్, కౌన్సిలర్ హరిదాసుగౌడ్, నాయకులు మర్రి రాంరెడ్డి, టేకుల కమలాకర్ రెడ్డి, జమ్మరాజు తదితరులు పాల్గొన్నారు.

ఫరూక్‌నగర్ ఉగాది వేడుకల్లో గుజరాత్ కలెక్టర్

పండుగ సందర్భంగా స్వగ్రామానికి విచ్చేసిన సుష్మిత ఐఏఎస్



పంచాంగ శ్రవణంలో పాల్గొన్న గుజరాత్ కలెక్టర్ సుష్మిత (పింక్ డ్రెస్)

షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం నిర్వహించిన ఉగాది వేడుకల్లో గుజరాత్ (రాణికుంజ్) కలెక్టర్ ఇప్పలపల్లి సుష్మిత పాల్గొన్నారు. తెలుగు నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని స్వగ్రామానికి వచ్చిన ఆమె కుటుంబ సభ్యులు, స్థానికులతో కలిసి పంచాంగ శ్రవణం చేశారు.

కేబుల్ బ్రిడ్జిపై అర్ధరాత్రి వరకు స్పెషల్ డ్రైవ్

- 23 మందికి చలానాలు
- పునరావృతం అయితే కేసు నమోదు



కేబుల్ వంతెనపై పార్కింగ్ చేసిన వారికి చలానా విధిస్తున్న పోలీసులు

గచ్చిబౌలి: కేబుల్ బ్రిడ్జిపై అర్ధరాత్రి సెల్ఫీ దిగుతూ ఓ యువకుడు మృతి చెందిన ఘటనతో పోలీసులు అప్రమత్తమయ్యారు. మాదాపూర్ ట్రాఫిక్ సీఐ నర్సింహ్మ, లా అండ్ ఆర్డర్ సీఐ మల్లేష్ ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం అర్ధరాత్రి దాటే వరకు ఇక్కడ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. బ్రిడ్జిపై వాహనాలు పార్కింగ్ చేసిన 23 మందికి చలానా విధించారు. రెండో సారి పట్టుబడితే కేసు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు. రాత్రి సమయంలో దుర్గం చెరువు అందాలను తిలకించేందుకు నగరం నలుమూలల నుంచి కేబుల్ బ్రిడ్జిపైకి జనం తండోపతండాలుగా వస్తున్నారు. వీకెండ్, సెలవు దినాల్లో సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. బ్రిడ్జిపై వాహనాలు పార్కింగ్ చేయడం, బర్త్ డేలు జరుపుకోవడం, సెల్ఫీలు దిగడం సరికాదని ట్రాఫిక్ పోలీసులు సూచిస్తున్నారు. వాహనాలను బ్రిడ్జి బయట పార్కింగ్ చేసి రెండు వైపులా ఉన్న పాత్ వేలోనే సందర్శకులు ఉండాలని పేర్కొంటున్నారు.

మహనీయుల జయంతి ఉత్సవాల పోస్టర్ విడుదల

మలక్‌పేట: తెలంగాణ సోషలిస్టు స్టూడెంట్స్ అసోసియేషన్ (టీఎస్ఎస్ఏ) ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహనీయుల జయంతి ఉత్సవాల వాల్‌పోస్టర్‌ను మంగళవారం ఎంపీ ఆర్.కృష్ణయ్య విడుదల చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కూరెళ్ల మహేష్‌కుమార్ మాట్లాడుతూ..ఈ నెల 14 తేదీన మూసారంబాగ్ చౌరస్తాలో మహాత్మా జ్యోతిరావు పూలే, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపీ కృష్ణయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరవుతారని అన్నారు. పేదలకు అన్నదానం కార్యక్రమం ఉంటుందన్నారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

బడి బాధ్యత 'అమ్మ'దే..

ప్రభుత్వ పాఠశాలలో ఎస్ఎంసీలకు మంగళం

- అమ్మ ఆదర్శ కమిటీల ఏర్పాటుకు విద్యాశాఖ ఆదేశం
- చైర్‌పర్సన్‌గా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు
- కన్వీనర్‌గా పాఠశాల ప్రధానోపాధ్యాయులు
- బ్యాంకు ఖాతాలు తెరవాలని సీఎంఓ ఆదేశం
- త్వరగతిన కమిటీలు పూర్తి చేయాలని ఉత్తర్వులు



పోల్కంపల్లి ప్రభుత్వ పాఠశాల

పాఠశాలల వివరాలు	
ప్రాథమిక పాఠశాలలు	880
యూపీఎస్	180
జెడ్పీహెచ్ఎస్	249
మొత్తం	1,309

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలకు సర్కారు మంగళం పాడింది. వాటి స్థానంలో అమ్మలకు అధికారం ఇస్తూ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు విద్యాశాఖ నుంచి ఆదేశాలు సైతం జారీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం కమిటీల ఏర్పాటు ప్రక్రియ కొనసాగుతోంది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో కమిటీల ఏర్పాటు ఒకింత జాప్యం జరుగుతోంది. ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్య, మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా ఈ కమిటీల ఏర్పాటు జరుగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో గ్రామీణ మహిళా సమాఖ్య, పట్టణ ప్రాంతాల్లో మెప్మా సహకారంతో కమిటీలు వేయనున్నారు. జిల్లా వ్యాప్తంగా 1,309 పాఠశాలల్లో ఈ నూతన కమిటీలు ఏర్పాటు చేయాల్సి ఉంది.

రెండేళ్ల కాలపరిమితి

గ్రామ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీకి చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కన్వీనర్‌గా ఉంటారు. గ్రామంలో లేదా పట్టణంలో రెండు లేదా అంతకంటే ఎక్కువ మహిళా సమాఖ్యలు ఉంటే పాఠశాలకు సమీపంలో ఉన్న అధ్యక్షురాలు మొదటి సంవత్సరానికి, తర్వాత రొటేషన్‌లో మరో సంవత్సరానికి ఇంకో సమాఖ్య వారికి అధ్యక్ష పదవి మార్పు చేయాలి. కమిటీలో సభ్యులుగా ఉండేందుకు తల్లులు ఏదేని సంఘంలో తప్పనిసరిగా సభ్యులుగా ఉండాలి. 1 నుంచి 10వ తరగతి వరకు ప్రతీ తరగతి నుంచి ముగ్గురు తల్లులు లేదా మహిళా సంరక్షకులను ఎంపిక చేయాలి. ముగ్గురు సభ్యుల్లో ఒకరు ఎస్సీ లేదా ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన వారు ఉండాలి. రెండేళ్ల పాటు ఈ పదవీకాలం ఉంటుంది. పిల్లలు బడి నుంచి వెళితే వారి స్థానంలో కొత్త సభ్యులను చేర్పించాలి. చైర్‌పర్సన్, కన్వీనర్‌లు జాయింట్ అకౌంట్ ఓపెన్ చేయాలి. అన్ని పనులు, ఆర్థిక లావాదేవీలకు పాఠశాల కమిటీ తీర్మాణం తప్పనిసరి. నిర్ణయాలు, తీర్మానాల కోసం కనీసం 50% సభ్యులు హాజరుకావాలి.

విధులు-బాధ్యతలు
బాలికల టాయిలెట్స్ నిర్మాణం
తాగునీటి సౌకర్యాలు కల్పించడం
మరమ్మతు పనులు చేపట్టడం
నిరుపయోగంగా ఉన్న టాయిలెట్స్ పునరుద్ధరణ
తరగతి గదుల విద్యుద్దీకరణ
పాఠశాల ఆవరణలో పారిశుద్ధ్య నిర్వహణ
విద్యుత్ బిల్లులు తగ్గించేందుకు సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు
యూనిఫాం కుట్టడం
ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు నమోదు
మధ్యాహ్న భోజన పథకం
విద్యార్థుల ప్రగతి
పరీక్షల నిర్వహణ
ఆరోగ్య పరీక్షలు

పాఠశాల స్థాయిలో సంబంధిత రికార్డులను ప్రధానోపాధ్యాయులు నిర్వహించాలి.

త్వరలోనే ప్రక్రియ పూర్తి



అమ్మ ఆదర్శ కమిటీల ఏర్పాటుకు ప్రభుత్వం ఇప్పటికే ప్రభుత్వం నుంచి ఆదేశాలొచ్చాయి. గ్రామ సమాఖ్య అధ్యక్షుల వివరాలు సేకరించాం. ప్రస్తుతం సభ్యులను గుర్తిస్తున్నారు. అభివృద్ధి, సంక్షేమం, నిర్వహణ భారం రాష్ట్ర ప్రభుత్వానిదే. త్వరలో జాయింట్ ఖాతాలు తెరిచి కమిటీల ఎంపిక ప్రక్రియ పూర్తిచేస్తాం.

– వెంకట్‌రెడ్డి, మండల విద్యాధికారి ఇబ్రహీంపట్నం

బడులు బాగవుతాయి



ఎస్ఎంసీ కమిటీలు ఉండగా గ్రామ స్థాయిలో రాజకీయ రంగు పూసుకున్నట్లుగా కమిటీలు ఉండేవి. పరోక్షంగా రాజకీయ నాయకులు రంగ ప్రవేశం చేసేవారు. కేంద్రం, రాష్ట్రం నిధుల కోసం వేచి ఉండాల్సి ఉండేది. ఇప్పుడు మహిళా సమాఖ్యలకు ఇవ్వడం శుభపరిణామం. తల్లి బాధ్యతతో బడులు బాగుపడతాయి.

– చెరుకూరి మంగ, ఎంపీటీసీ సభ్యురాలు, పోల్కంపల్లి



ఇంటి నుంచే ఓటు

ప్రజాస్వామ్యంలో వంద శాతం ఓటు హక్కు వినియోగించుకునేలా ఎన్నికల కమిషన్ అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఓ వైపు ఓటర్లను ప్రోత్సహించేందుకు సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేస్తూనే అచేతనులు సైతం ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగించుకునే వెసులుబాటు కల్పిస్తోంది. ఇందుకు కావాల్సిన దరఖాస్తుల పంపిణీ ప్రారంభమైంది.

- అచేతనులకు వెసులుబాటు
- వృద్ధులకు, దివ్యాంగులకు అవకాశం
- ఫారం-12డి పంపిణీ చేస్తున్న బీఎల్ఓలు

తుక్కుగూడ: పార్లమెంటు ఎన్నికలో ఓటింగ్ శాతం పెంచేందుకు ఎన్నికల సంఘం ముందుకుసాగుతోంది. నూతన ఓటరు నమోదుకు విస్తృత ప్రచారం చేస్తూనే.. ప్రతీ ఒక్కరు ఓటరు ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవగాహన కల్పిస్తోంది. ఇప్పటికే ఈవీఎంల వినియోగంపై ప్రాక్టికల్గా వివరిస్తోంది. దీంతో పాటు వృద్ధులు, దివ్యాంగులు తప్పనిసరిగా ఓటేసేందుకు చర్యలు తీసుకుంటోంది. ఈ నేపథ్యంలో 80 ఏళ్లు దాటిన వృద్ధులు, 40శాతం వైకల్యం ఉండి నడవలేని దివ్యాంగులకు ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశం కల్పిస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారిగా ఈ విధానం ప్రవేశపెట్టారు. లోక్‌సభ ఎన్నికల్లోనూ కొనసాగించేందుకు ఈసీ నిర్ణయం తీసుకుంది. ఈ విధానం తొలుత కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఈ విధానం విజయవంతం కావడంతో దేశ వ్యాప్తంగా అమలు చేస్తున్నారు.

దరఖాస్తుల పంపిణీ షురూ

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో తహసీల్దార్లు, బీఎల్ఓలు ఇంటింటికి వెళ్లి కదలలేని పరిస్థితిలో ఉన్న వృద్ధులు, దివ్యాంగులను గుర్తించి ఫా-12 డి ద్వారా ఓటుకు దరఖాస్తు చేయిస్తున్నారు. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని చేవెళ్ల, రాజేంద్రనగర్, మహేశ్వరం, శేరిలింగంపల్లి, పరిగి, వికారాబాద్, తాండూరు అసెంబ్లీ సెగ్మెంట్లు ఉన్నాయి. ఈ ఏడు నియోజకవర్గాలలో 29,19, 465 మంది ఓటర్లున్నారు. 2,824 పోలింగ్ కేంద్రాలు, 53 సహాయక పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఇప్పటికే ఎన్నికల సంఘం అధికారులు సిబ్బందికి ఫాం-12 డి అందిచేలా చర్యలు తీసుకుంటోంది. ఇలా దరఖాస్తు చేసుకున్న ఓటర్లకు వారి ఇంటి వద్దే రహస్య బ్యాలెట్ విధానం ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

15లోగా దరఖాస్తుల స్వీకరణ

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో 80 ఏళ్ల వయస్సు పై బడిన వారు, 40 శాతం వైకల్యం ఉన్నవారు, బెడ్ రెస్టులో ఉన్నవారు ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఫారం-12డీ అందజేస్తున్నాం. గ్రామాల్లో బీఎల్ఓలు ఈ ప్రక్రియను నిర్వహిస్తున్నారు. ఈ నెల15 లోపు దరఖాస్తులు తీసుకుంటాం.

– సూరజ్‌కుమార్, ఆర్డీఓ, కందుకూరు

గెలిపిస్తే కేంద్రం నుంచి నిధులు

- మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యం
- చేవెళ్ల లోక్‌సభ అభ్యర్థి, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

షాబాద్: చేవెళ్ల ఎంపీగా గెలిపిస్తే.. కేంద్రం నుంచి భారీగా నిధులు తీసుకువచ్చి చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని కొమరబండ, కేసారం గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలకు చెందిన యువత బీఆర్ఎస్ నాయకులు చల్లా ఇంద్రారెడ్డి, అంజిరెడ్డి, గంధం రమేశ్, ఉమ్మెంతల రమేశ్‌తో కలిసి కాషాయ కండువా కప్పుకొన్నారు. ఈ సందర్భంగా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రధాని మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. మోదీ ప్రవేశపెట్టిన కేంద్ర సంక్షేమ పథకాల పట్ల ఇప్పుడిప్పుడే యువతకు అవగాహన ఏర్పడుతోందన్నారు. దేశం కోసం ధర్మం కోసం బీజేపీకి ఓటేయాలని పిలుపునిచ్చారు. చేవెళ్ల పార్లమెంట్‌పై ఎగిరేది బీజేపీ జెండాయేనని.. భారీ మెజార్టీతో గెలిపించేందుకు యువత కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ఓటేసినా వచ్చే ప్రయోజనం ఏమీ ఉండదన్నారు. ఆరు గ్యారంటీల పేరిట అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మభ్య పెడుతోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ చేవెళ్ల నియోజకవర్గం కౌన్సిల్ మెంబర్ మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి, బూత్ అధ్యక్షుడు భవదేశ్, సీనియర్ నాయకులు నారాయణ, రాజు, విష్ణువర్ధన్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, బీజేవైఎం నాయకులు పొన్నా రాజీవ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిలుకూరు బాలాజీ సేవలో ఎంపీ రంజిత్‌రెడ్డి

- కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు



చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకుడు రంగరాజన్‌తో ఎంపీ రంజిత్‌రెడ్డి, భీంభరత్ తదితరులు

మొయినాబాద్: చేవెళ్ల ఎంపీ, కాంగ్రెస్ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి ఉగాది పర్వదినం సందర్భంగా మంగళవారం చిలుకూరు బాలాజీని దర్శించుకున్నారు. ఆయన సతీమణి, టీటీడీ బోర్డు సభ్యురాలు సీతా రంజిత్‌రెడ్డి, కూతురు పూజా ఆకాంక్షరెడ్డి, అల్లుడు రాజశేఖర్‌రెడ్డి, కుమారుడు రాజ్ ఆర్యన్‌రెడ్డి తదితర కుటుంబ సభ్యుల సమేతంగా చిలుకూరు బాలాజీని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు రంగరాజన్ ఆశీర్వచనం ఇచ్చారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని సుందరేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఉగాది పచ్చడి వలే జీవితంలో ఒడిదుడుకులు

ఉగాది పచ్చడిలోని షడ్రుచుల వలే ప్రతి ఒక్కరి జీవితంలో ఒడిదుడుకులు, సుఖదుఃఖాలు, కష్టసుఖాలుంటాయని మంచిని ఆస్వాదించాలని.. చెడు ఉన్నప్పుడు తట్టుకోవాలని చేవెళ్ల ఎంపీ, కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి అన్నారు. చిలుకూరు బాలాజీని దర్శించుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజలందరికి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. పండుగలను ప్రజలంతా సంతోషంగా జరుపుకోవాలని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో అందరూ బయటకు వచ్చి ఓటు వేయాలన్నారు. ఏ పార్టీకి ఓటు వేయాలనేది మీరే నిర్ణయించుకోండని.. ఓటు మాత్రం తప్పనిసరిగా వేయాలన్నారు. ఓటుతో మన బలం, బలగం ఏమిటో నిరూపించుకోవాలన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి భీంభరత్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

మొబైల్ కాల్ సెంటర్!

- పోలీసులకు చిక్కకుండా సైబర్ నేరగాళ్ల సరికొత్త ఎత్తుగడ
- వాహనాల్లో తిరుగుతూ రోజుకో ప్రాంతంలో మోసాలు
- హైవేల పక్కన, నిర్మానుష్య ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్
- సామాన్యులకు ఫోన్లు చేసి మాయమాటలతో బురిడీ
- పోలీసులకు సాంకేతిక ఆధారాలు దొరకకుండా జాగ్రత్తలు

మూడు కమిషనరేట్లలో సైబర్ నేరాలు

కమిషనరేట్	2021	2022	2023
హైదరాబాద్	2,066	4,471	4,332
రాచకొండ	1,360	2,049	2,562
సైబరాబాద్	3,854	4,850	5,342

సాక్షి, సిటీబ్యూరో: ''బహుళ జాతి ఐటీ కంపెనీలో పనిచేస్తున్న జస్విత్ సైబర్ నేరస్తుల వలలో చిక్కి రూ.5 లక్షలు పోగొట్టుకున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు సైబర్ పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితుడితో కేటుగాళ్లు సంప్రదింపులు జరిపిన పలు సెల్‌ఫోన్ నంబర్ల టవర్ లొకేషన్, సిగ్నళ్లను గుర్తించేందుకు యత్నించిన పోలీసులు అవాక్కయ్యారు. రోజుకో ఫోన్ నంబరు నుంచి, గంట గంటకో టవర్ లొకేషన్ నుంచి ఫోన్లు చేసినట్లు గుర్తించి విస్తుపోయారు. లభించిన సాంకేతిక ఆధారాలతో టవర్ లొకేషన్ ప్రాంతానికి వెళ్లిన పోలీసులు.. అదంతా నిర్మానుష్య ప్రాంతం కావడంతో షాకయ్యారు. స్థిరంగా ఒక చోట నుంచి కాల్ సెంటర్ ఏర్పాటు చేసి ఫోన్లు చేస్తే టవర్ లొకేషన్‌లో దొరికిపోతామని గ్రహించిన నేరస్తులు ఇలా మొబైల్ కాల్ సెంటర్‌తో బాధితులను మోసం చేస్తున్నట్లు తేల్చారు.''

.. ఇలా సైబర్ నేరస్తులు మొబైల్ కాల్ సెంటర్లతో పోలీసులకు సవాల్ విసురుతున్నారు. సెల్‌ఫోన్ సిగ్నల్, టవర్ లొకేషన్, బ్యాంకు ఖాతా వివరాల ఆధారంగా పోలీసులు తమ ఉనికి, లావాదేవీలను పసిగడుతున్నారని గ్రహించిన సైబర్ కేటుగాళ్లు సరికొత్త మార్గాలను అన్వేషిస్తున్నారు. కాల్ సెంటర్ల ద్వారా మోసాలు చేస్తే ఏదోఒక రోజు పోలీసులకు చిక్కుతామని భావించిన కేటుగాళ్లు కొత్తగా మొబైల్ కాల్ సెంటర్లను తెరుస్తున్నారు.

కార్లతో తిరుగుతూ మోసాలు..

భౌతికంగా కాల్ సెంటర్లను ఏర్పాటు చేస్తే సాంకేతిక ఆధారంగా పోలీసులు వీటిని గుర్తిస్తారని గ్రహించిన నేరస్తులు కొత్త మార్గాన్ని అన్వేషించారు. సాంకేతిక ఆధారాలు దొరకకుండా జాగ్రత్తపడుతున్నారు. కారు, వ్యాన్ వంటి కదిలే వాహనాల్లో మొబైల్ కాల్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఐదారు మంది సైబర్ నేరస్తులు ముఠాగా ఏర్పడి, నాలుగైదు వాహనాల్లో సెల్‌ఫోన్లు, కస్టమర్ల డేటాతో తలోదిక్కున తిరుగుతున్నారు. నిర్మానుష్య ప్రాంతంలో వాహనాలను నిలిపి, అమాయకులకు ఫోన్లు చేసి బురిడీ కొట్టిస్తూ అందికాడిని దండుకుని ఫోన్లు బంద్ చేస్తున్నారు.

అవన్నీ రోడ్లు, నిర్మానుష్య ప్రాంతాలే..

బాధితుల నుంచి వివరాలు సేకరించిన పోలీసులు సాంకేతిక ఆధారాల సేకరించి నకిలీ కాల్ సెంటర్లను గుర్తించి, పక్కా పథకం ప్రకారం వాటిపై దాడి చేసి నేరస్తులను పట్టుకునేవారు. దీంతో సైబర్ నేరస్తులు మొబైల్ కాల్ సెంటర్లను తెరలేపినట్లు ఓ పోలీసు ఉన్నతాధికారి తెలిపారు. వాహనాల్లో కూర్చొని రోజుకో ప్రాంతంలో తిరుగుతూ సైబర్ మోసాలకు పాల్పడుతున్నారు. బాధితుల నుంచి ఫిర్యాదు అందుకున్న పోలీసులకు టెక్నికల్ ఆధారాలు లభించకుండా జాగ్రత్త పడుతున్నారు. ఒక్కో రోజు ఒక్కో చోటి నుంచి నేరాలు చేసినట్లు సెల్‌ఫోన్ సిగ్నల్స్, లొకేషన్స్ వస్తుంటాయి. అక్కడికి వెళ్లి చూస్తే అదంతా హైవే రోడ్డు మార్గం, నిర్మానుష్య ప్రాంతం ఉంటున్నాయి. దీంతో వారిని పట్టుకోవడం పోలీసులకు సవాల్‌గా మారింది.

జలగం సతీష్‌గౌడ్‌కు ఓయూ డాక్టరేట్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ సైన్స్ కాలేజీ భౌతికశాస్త్రం విభాగం నుంచి జలగం సతీష్‌గౌడ్‌కు పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. భౌతికశాస్త్రం అధ్యాపకులు డాక్టర్ నర్సింహులు పర్యవేక్షణలో 'లోహ అక్సైగ్‌ల నానో కణాలను పీవీఏ మాత్రికలో చొప్పించిన నానో సంయోజకాల తయారి, లక్షణీకరణ' అంశంపై చేసిన పరిశోధనకు ఓయూ డాక్టరేట్ ప్రకటించింది. 20 ఏళ్లుగా అధ్యాపక వృత్తిలో కొనసాగుతున్న సతీష్‌గౌడ్ ప్రస్తుతం మహబూబాబాద్ జిల్లా మరిపెడ ట్రైబల్ గురుకుల డిగ్రీ కాలేజీలో ఫిజిక్స్ లెక్చరర్. సతీష్‌గౌడ్‌కు డాక్టరేట్ రావడం పట్ల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.వేణుగోపాల్‌రావు, ధ్యాన శిక్షకులు జనార్దనచారి, అధ్యాపక బృందం అభినందనలు తెలిపారు.



తెలంగాణ భవన్‌లో నిర్వహించిన ఉగాది పంచాంగ శ్రవణంలో పాల్గొన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యేలు సబితారెడ్డి, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కాలె యాదయ్య, మాజీ ఎమ్మెల్యేలు ఆనంద్, పొన్నాల లక్ష్మయ్య తదితరులు

– సాక్షి, రంగారెడ్డి జిల్లా

మతం కంటే మానవత్వం గొప్పది

ఎమ్మెల్యే కసిరెడ్డి, ఎంపీ అభ్యర్థి మల్లురవి

ఆమనగల్లు: మతం కంటే మానవత్వం గొప్పదని, అన్ని మతాల సారాంశం అదేనని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాగర్‌కర్నూల్ పార్లమెంటు అభ్యర్థి డా.మల్లురవి అన్నారు. మంగళవారం పట్టణంలోని పలు మసీదుల్లో పార్టీ ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడారు. రంజాన్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని మతాలకు ప్రాధాన్యత ఇస్తుందని, సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలంతా కాంగ్రెస్‌కు అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మాజీమంత్రి చిత్తరంజన్ దాస్, పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ వస్పుల జంగయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాటనర్సింహ, ఉపాధ్యక్షుడు వెంకటరమణారెడ్డి, ఎం.ఎ.ఖలీల్, పార్టీ మండల అధ్యక్షుడు జగన్, పట్టణ అధ్యక్షుడు మానయ్య, పలు మసీదు కమిటీల అధ్యక్షులు గౌస్, ఖాదర్‌ఖాద్రి, నాయకులు విజయ్, జంతుక యాదయ్య, కాలె మల్లయ్య, మైసయ్య, అలీం, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


ముస్లింలకు పండ్లు తినిపిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి, మల్లురవి

కులమతాలకు అతీతం..

చేవెళ్ల: కులమతాలకు అతీతంగా జరుపుకొనే పండుగ రంజాన్ అని చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి అన్నారు. శంకర్‌పల్లి మున్సిపాలిటీ కేంద్రంలో మున్సిపల్ కౌన్సిలర్ శ్రీనాథ్‌గౌడ్ ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఇందులో ఎంపీ రంజిత్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లింకు పండ్లు తినిపించి, ఉపవాస దీక్ష విరమింపచేశారు. అనంతరం ఎంపీ మాట్లాడారు. ఎంపీగా తనను గెలిపిస్తే.. మీకు అందుబాటులో ఉండి, సమస్యలను పరిష్కరిస్తానని చెప్పారు. కులమతాలకు అతీతంగా పండుగలను జరుపుకోవటం మన ఆచారమని, దీనిని రాజకీయం చేసేందుకు వస్తున్న వారికి ప్రజలే తగిన గుణపాఠం చెప్పాలన్నారు. పార్టీ నాయకులు ఉదయ్ మోహన్ రెడ్డి, సత్యనారాయణరెడ్డి, జనార్దన్‌రెడ్డి, గోపాల్ రెడ్డి, రవీందర్‌రెడ్డి, ఎజాస్, మజీద్‌కమిటీ చైర్మన్ జాకీర్, మున్సిపల్ వైస్‌చైర్మన్ వెంకటరామిరెడ్డి, బల్వంత్‌రెడ్డి, అనంత్‌రెడ్డి, మైసయ్య ఉన్నారు.


ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎంపీ రంజిత్‌రెడ్డి

ఆశలు ఆవిరి

పాతాళానికి గంగమ్మ

- ఎండిన పంట పొలాలు
- దిగాలు చెందుతున్న అన్నదాతలు

షాబాద్: మండే ఎండలతో చెరువులు, కుంటలు, జలాశయాల్లో నీరు అడుగంటింది. భూగర్భ జలాలు పాతాళానికి చేరాయి. బోరుబావులకు నీరందటం లేదు. తద్వారా సాగునీరు అందక నేలలు నెర్రలు వారగా.. పంటలు ఎండిపోయి, అన్నదాతల ఆశలు ఆవిరైపోతున్నాయి. పంటలు కళ్లముందే ఎండిపోతున్నా.. ఏమీ చేయలేక కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. దిగుబడిపై ప్రభావం ఎలా ఉన్నా.. అసలుకే మోసం వచ్చేటట్లు ఉందని వాపోతున్నారు.

పదిశాతం ఆవిరి

షాబాద్ మండల పరిధి నాన్‌ంధార్‌ఖాన్‌పేట్, దామర్లపల్లి, షాబాద్, తాళ్లపల్లి, కక్కులూర్, సర్దార్‌నగర్, అంతిరెడ్డిగూడ, మాచన్‌పల్లి, అంతారం, కుర్వగూడ తదితర గ్రామాల్లో సాగునీరు అందక, ఎర్రని ఎండలకు పంటలు మాడిపోతున్నాయి. కనీసం పెట్టుబడులు కూడా దక్కేటట్లు లేవని పలువురు రైతులు ఆవేదన చెందుతున్నారు. మండలంలో సుమారు 10 వేల ఎకరాల్లో వరి, 800 ఎకరాల్లో మొక్కజొన్న వేయగా.. చివరి దశకు సాగు నీరందక సుమారు 10 శాతం పంటలు ఎండిపోయినట్లు రైతులు పేర్కొంటున్నారు.


నాన్‌ంధార్‌ఖాన్‌పేట్‌లో ఎండిన వరి పంట

సాగు చేయాలంటే భయం



యాసంగిలో రెండు ఎకరాల్లో వరి పంట వేసిన. భూగర్భ జలాలు పడిపోవడంతో నీరందక బోరు ఆగుతూ పోస్తోంది. పొట్టదశలో ఉన్న వరి పొలానికి నీరులేక ఎండే పరిస్థితి వచ్చింది. ఎనిమిదేళ్లలో ఇలాంటి పరిస్థితి చూడలేదు. సాగు చేయాలంటే భయమేస్తోంది.

– గడ్డం రాజు, రైతు, అంతిరెడ్డిగూడ

ఏం చేయాలో అర్థం కావడం లేదు



నాకు మూడెకరాల పొలం ఉంది. గతంలో ఎప్పుడూ ఎండిపోలేదు. బోరుబావి ఆధారంగా వరి సాగు చేస్తున్న. రెండు వారాల కిందట నీరు పోసే బోరు ఎండి పోయింది. ఇప్పుడు పంటను ఎలా కాపాడుకోవాలో అర్థం కావటం లేదు. నీటి కోసం పొరుగు రైతుతో మాట్లాడుతున్న.

– అశిగారి బాల్‌రాజు, రైతు తాళ్లపల్లి

సెల్‌ఫోన్ మాట్లాడొద్దన్నందుకు..

బాలిక అదృశ్యం


సీహెచ్ గౌరి (ఫైల్)

కాచిగూడ: సెల్‌ఫోన్ ఎక్కువగా మాట్లాడవద్దన్నందుకు ఓ బాలిక ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయిన సంఘటన కాచిగూడ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. కాచిగూడ ఎస్‌ఐ నరేష్ కుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నిజామాబాద్‌కు చెందిన బాలాజీ రావు కుటుంబంతో కలిసి శుభకార్యం నిమిత్తం ఈ నెల 8న కాచిగూడ, సుందర్‌నగర్‌లోని బంధువుల ఇంటికి వచ్చారు. బాలాజీరావు కుమార్తె సీహెచ్ గౌరీ (13) 8వ తరగతి చదువుతోంది. సెల్ ఫోన్ అతిగా మాట్లాడుతుండడంతో తల్లి, సోదరుడు ఆమెను మందలించారు. దీంతో మనస్తాపానికి లోనైన మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటికి వెళ్లిపోయింది. సెల్‌ఫోన్ కూడా వెంట తీసుకెళ్లింది. దీంతో కుటుంబ సభ్యులు వెతికినా వెతికాన పరిసర ప్రాంతాల్లో గాలించినా ఆమె ఆచూకీ లభించలేదు. సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్‌లో ఉంది. గౌరి సోదరుడు విష్ణు కార్తి ఫిర్యాదు మేరకు కాచిగూడ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

కొత్తూరు: ఆధ్యాత్మికత అలవార్చుకునే వారికి మానసిక ప్రశాంతత చేకూరుతుందని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. మండల పరిధి ఇన్ముల్‌నర్వ గ్రామంలో మంగళవారం నిర్వహించిన సంత్‌శ్రీ సేవాలాల్ ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు చేసి, అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం మాట్లాడారు. గిరిజనుల ఆరాధ్యదైవం సేవాలాల్ మహరాజ్ అని, సేవాలాల్ చూపిన మార్గంలో పయనించాలని సూచించారు. స్వార్థం వీడి.. సేవా గుణం అలవర్చుకోవాలన్నారు. జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ నవీన్ కుమార్‌రెడ్డి, నాయకులు సత్యనారాయణ, అజయ్‌నాయక్, మిట్టునాయక్, గోపాల్‌నాయక్, స్థానికులు ఉన్నారు.


భోజనం వడ్డిస్తున్న మాజీ ఎమ్మెల్యే

హెడ్ కానిస్టేబుల్‌పై దాడి

సైదాబాద్: విధి నిర్వహణలో ఉన్న పోలీస్ హెడ్ కానిస్టేబుల్‌పై ఓ యువకుడు దాడికి పాల్పడిన సంఘటన సైదాబాద్ పీఎస్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సంతోష్‌నగర్‌కు చెందిన కృష్ణదొర మలక్‌పేట పీఎస్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం ఉదయం సిబ్బందితో కలిసి పెట్రోలింగ్‌లో ఉన్న ఆయనకు.. సైదాబాద్ పీఎస్ నుంచి మాధవనగర్‌లో రహదారిపై తండ్రీ కొడుకులు గొడవ పడుతున్నారని వెళ్లి చూడాలని సమాచారం అందింది. దీంతో ఆయన సిబ్బందితో అక్కడికి వెళ్లగా మాధవనగర్‌కు చెందిన జి.కోటప్ప అతని కుమారుడు వరుణ్ గొడవ పడుతున్నారు. హెడ్ కానిస్టేబుల్ వారిని అడ్డుకునే ప్రయత్నం చేయగా వరుణ్ దుర్భాషలాడుతూ అతనిపై దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో హెడ్‌కానిస్టేబుల్‌కు గాయాలయ్యాయి. దీంతో సైదాబాద్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకోగా వరుణ్‌ను అతని తల్లి జ్యోతి, మరో ఇద్దరు స్నేహితులు అక్కడి నుంచి తప్పించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సైదాబాద్ పోలీసులు దాడికి పాల్పడిన వరుణ్ అతను పారిపోయేందుకు సహకరించిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో వీరంగం

బంజారాహిల్స్: డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులకు సహకరించకుండా మద్యం మత్తులో న్యూసెన్స్‌కు పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే... తెల్లాపూర్‌కు చెందిన శ్రీనివాస్‌రెడ్డి సోమవారం రాత్రి టోలిచౌకీ నుంచి వెళ్తుండగా ఇంటర్నేషనల్ స్కూల్ వద్ద టోలిచౌకీ ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్‌లో భాగంగా ఆపారు. మద్యం మత్తులో శ్రీనివాస్‌రెడ్డి.. బ్రీత్ ఎనలైజర్ టెస్ట్‌కు నిరాకరించాడు. దీంతో ఠాణాకు తరలించి టెస్ట్ నిర్వహించగా 98 ఎంజీగా శ్వాస పరీక్షలో తేలింది. దీంతో ఆయనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆనందం పంచేందుకు వచ్చేదే ఉగాది


షాద్‌నగర్: స్వామి వారి పల్లకీ సేవలో ఎమ్మెల్యే శంకర్


కడ్తాల్: పంచాంగ శ్రవణంలో పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి

- ప్రజలకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలి
- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: అందరి జీవితాల్లో ఉగాది ఉషస్సులు నింపాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఉగాది పర్వదినం సందర్భంగా ఫరూఖ్‌నగర్ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో నిర్వహించిన పూజాకార్యక్రమంలో భాగంగా స్వామి వారి పల్లకీ సేవలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం చేపట్టిన పంచాగ శ్రవణ కార్యక్రమంలో మాట్లాడారు. జీవితంలో ఆనందోత్సవాలను పంచేందుకు వచ్చేదే ఉగాది అని, ఈ పండుగ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షిచారు. ఈ ఏడు ప్రజల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తుందని, కొత్త ఆశలను చిగురింపజేస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతుందని, పేదల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతుందన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెబాబయ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతిరెడ్డి, చెన్నయ్య, ఒగ్గుకిషోర్, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, అంచ రాములు, అప్పి, వెంకట్‌రావ్, సూర్యప్రకాష్, శ్రీను, అశోక్, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్‌లో..

కడ్తాల్: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని చెన్నకేశవ స్వామి ఆలయంలో వేదపండితుడు వెంకటేశ్వర శర్మ పంచాంగం చదివి వినిపించారు. అదే విధంగా మక్తమాధారం వేణుగోపాల స్వామి ఆలయంలో పండిత ప్రకర్మ వింజమూరి రామానుజన్ చార్యుల ఆధ్వర్యంలో పంచాగ శ్రవణం చేశారు. ఇందులో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, స్థానిక నాయకులతో కలిసి పాల్గొన్నారు. అంతకు ముందు ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మాజీ సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, సేవ్యానాయక్, విఠలయ్యగౌడ్, నాయకులు భాస్కర్‌రెడ్డి, బీచ్యానాయక్, నరేందర్‌రెడ్డి, జంగారెడ్డి, నర్సింహగౌడ్, శంకర్‌నాయక్, బాలరాజ్, చెన్నయ్య పాల్గొన్నారు.

మృతదేహాలు అప్పగింత

రాజేంద్రనగర్: ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడిన బండ్లగూడ సన్‌సిటీకి చెందిన ఆనంద్ కుటుంబ సభ్యుల మృతదేహాలకు మంగళవారం ఉస్మానియా మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మృతదేహాలను స్థానిక పోలీసులు ఆనంద్ సోదరుడికి అప్పగించారు. ఆనంద్ సోదరుడు రామాంతాపూర్‌లో నివసిస్తున్నాడని.. అక్కడే అంత్యక్రియలు నిర్వహించేందుకు తీసుకెళ్లినట్లు ఎస్సై రమేశ్ తెలిపారు.

అగ్ని ప్రమాదం

మణికొండ: ఇంట్లోని పూజ గదిలో అగ్ని ప్రమాదం జరిగిన ఘటన హైదర్‌షాకోట్ గ్రామంలో మంగళవారం జరిగింది. శంకర్ అనే వ్యక్తి ఇంట్లో పూజ చేసి భార్యతో కలిసి గుడికి వెళ్లాడు. పూజ గదిలో పెట్టిన దీపం కింద పడి పూజా సామగ్రికి అంటుకుని మంటలు లేచి వ్యాపించాయి. స్థానికులు గమనించి అగ్నిమాపక శాఖ వారికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలు ఆర్పివేయడంతో ప్రమాదం తప్పింది. నార్సింగి పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు.

మొక్కల నిర్వహణ గాలికి!


డివైడర్ మధ్యలో వాడిపోయిన మొక్కలు

- బండ్లగూడ కార్పొరేషన్‌లో కానరాని పచ్చదనం
- గత ప్రభుత్వ హయాంలో డివైడర్ మధ్యలో నాటిన మొక్కలు
- నీరు పట్టక వాడిపోతున్న వైనం

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలనే ఉద్దేశంతో రోడ్డు మధ్యలోని డివైడర్‌లో మొక్కలు నాటారు. అయితే వాటి నిర్వహణను అధికారులు గాలికి వదిలేయడంతో వాడిపోయి కనిపిస్తున్నాయి. అసలే ఎండకాలం.. అపై ఎండలు దంచికొడుతున్నాయి. వాటికి సక్రమంగా నీళ్లు పట్టకపోవడంతో ఎండిపోయి కనిపిస్తున్నాయి. గత ప్రభుత్వం కోట్లాది నిధులతో హరితహారం పథకంలో భాగంగా రోడ్లకిరువైపులా, డివైడర్ల మధ్యలో పెద్ద ఎత్తున మొక్కలు నాటింది. అయితే వాటి నిర్వహణను పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం ఎక్కడ చూసిన ఎండిపోయిన మొక్కలే దర్శనమిస్తున్నాయి.

కార్పొరేషన్‌లో పచ్చదనం కరువు..

ప్రస్తుతం ఎండలు దంచికొడుతున్నాయి. మున్సిపల్ పరిధిలో మొక్కల సంరక్షణపై సరైన నిర్వహణ అధికారుల పర్యవేక్షణ లేక చాలా చోట్ల మొక్కలు ఎండిపోతున్నాయి. మొక్కలు బతికుండాలంటే నిత్యం నీరు పట్టాల్సి ఉన్నప్పటికీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా మొక్కలు ఎండిపోకుండా అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

వ్యక్తి దారుణ హత్య

పహాడీషరీఫ్: ఫుట్‌పాత్‌పై పడుకునే విషయంలో తలెత్తిన వివాదంలో ఓ నిండు ప్రాణం బలైపోయింది. ఈ సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ గురువారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన కామ్ సింగ్(40) జల్‌పల్లి శ్రీరాం కాలనీలో నివసిస్తుంటాడు. సంజయ్ దయానంద్ కుకుడ్కార్ అనే వ్యక్తితో కలిసి క్యాటరింగ్ పనిచేస్తుంటాడు. కర్నాటకకు చెందిన మరోవ్యక్తి నవనాథ్(40) ఆటో డ్రైవర్. వీరిరువురు నిత్యం శ్రీరాం కాలనీ పోచమ్మ దేవాలయం పరిసరాల్లో ఫుట్‌పాత్‌పై నిద్రిస్తుంటారు. ఈ క్రమంలోనే సోమవారం రాత్రి నిద్రించే ప్రదేశం విషయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ విషయంలో ఆగ్రహించిన నవనాథ్.. కర్ర, రాయితో కామ్‌సింగ్ తలపై మోది హత్య చేశాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి వచ్చారు. వివరాలను సేకరించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

ఉప్పల్: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాలు ప్రకారం.. రామంతాపూర్ పాశం సత్తయ్య కాలనికి చెందిన సత్య భాస్కర్ రెడ్డి(34) ప్రైవేట్ ఉద్యోగి. సోమవారం రాత్రి బైక్‌పై బయటికు వెళ్లి తిరిగి వస్తుండగా రామంతాపూర్ శివాజీ విగ్రహం వద్ద నిలిచి ఉన్న మరో బైక్‌ను ఢీ కొట్టి కింద పడ్డాడు. ఈ ఘటనలో అతడి తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటపాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గాంధీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పండ్ల డబ్బులు అడిగినందుకు దాడి

వెంగళరావునగర్ : కొనుగోలు చేసిన పండ్లకు డబ్బులు అడిగినందుకు ఓ వ్యక్తి పండ్ల వ్యాపారిపై కత్తితో దాడికి పాల్పడిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కార్మికనగర్‌కు చెందిన మహ్మద్ అజార్ పండ్ల వ్యాపారం చేస్తున్నాడు. మూడు రోజుల క్రితం అబ్దుల్ నవీద్ అనే వృద్ధుడు అతడి వద్ద రూ.180 విలువైన పండ్లు కొనుగోలు చేసి డబ్బులు తర్వాత ఇస్తానని చెప్పాడు. ఈనెల 8న నవీద్ కార్మికనగర్ లెహర్ కేఫ్ వద్ద ఉండగా అజార్ అతడిని డబ్బులు ఇవ్వాలని కోరాడు. దీంతో ఆగ్రహానికి లోనైన నవీద్ డబ్బులు ఇవ్వనని తేల్చిచెప్పడమే కాకుండా పక్కనే పండ్ల దుకాణంలో ఉన్న కత్తిని తీసుకువచ్చి అజార్‌పై దాడికి పాల్పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతను ఆసుపత్రిలో చికిత్స అనంతరం మంగళవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ల చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

అబిడ్స్: ద్విచక్ర వాహనాలను దొంగిలించి తప్పించుకు తిరుగుతున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి అతడి నుంచి నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ రాజగోపాల్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అబిడ్స్, సౌత్ ఇండియా షాపింగ్ మాల్ పార్కింగ్‌లో నిలిపిన బైక్ చోరీకి గురికావడంతో వాహన యజమాని అబిడ్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు దుంగన విష్ణు ప్రసాద్‌ను నిందితుడిగా గుర్తించారు. అతడిని అరెస్టు చేసి విచారించగా పలు ప్రాంతాల్లో బైక్‌ల చోరీకి పాల్పడినట్లు తెలిపాడు. అతడి నుంచి నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అబిడ్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కబేళాకు తరలిస్తున్న పశువుల పట్టివేత

శంషాబాద్ రూరల్: ఆవులను అక్రమంగా కబేళాకు తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మదన్‌పల్లి శివారు బెంగళూరు జాతీయ రహదారిపై మంగళవారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. షాద్‌నగర్ నుంచి శంషాబాద్ వైపు వెళ్తున్న కంటైనర్ లారీని ఆపి పరిశీలించగా అందులో 15 ఆవులు, 58 ఎద్దులు ఉన్నాయి. అమీరుద్దీన్ అనే వ్యక్తి నుంచి వీటిని విజయవాడలో కొనుగోలు చేసి కర్నూలు మీదుగా హైదరాబాద్‌కు తీసుకువస్తున్నారు. ఆవులను బహదూర్‌పూర్‌లోని కబేళాకు తరలిస్తున్నట్లు గుర్తించి లారీ డ్రైవర్ దర్శనం కృష్ణయ్య, హెల్పర్ ఎండీ అమీర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. లారీ యజమాని జైనుద్దీన్‌తో పాటు మిగిలిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అలాగే పశువులను స్థానిక గోశాలకు తరలించారు.

తల్లీకూతురు అదృశ్యం

శంషాబాద్ రూరల్: భర్తతో గొడవపడిన మహిళ తన కూతురుతో పాటు అదృశ్యమైన ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గొల్లపల్లికి చెందిన సుశీల, ప్రభు దంపతులకు తొమిదేళ్ల కూతురు ఉంది. కొన్ని రోజులుగా ప్రభు భార్యను వేధిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి సుశీల తన తండ్రి రాములుకు ఫోన్ చేసి తనను భర్త వేధిస్తున్నాడని కూతురును తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోతున్నట్లు చెప్పింది. తర్వాత వారి ద్దరూ కనిపించ లేదు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.